# కూకట్‌పల్లి కాంగ్రెస్‌లో కుమ్ములాట





కొట్లాటలో కాంగ్రెస్ కార్యకర్త తల పగిలిన దృశ్యం

సమావేశంలోనే కొట్లాడుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

- ఆత్మీయ సమావేశంలో పొట్టు పొట్టు కొట్టుకున్న ఆ పార్టీ కార్యకర్తలు
- తలలు పగిలేలా తన్నుకున్న శ్రేణులు
- అభ్యర్థికి తొలి రోజు నుంచే ఎదురుగాలి
- జరుగుతున్న పరిణామాలతో అంతర్మథనంలో అభ్యర్థి 'బండి' రమేశ్?

సిటీబ్యూరో/కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 6: గ్రేటర్ కాంగ్రెస్‌లో రోజుకో రీతిలో కుమ్ములాటలు జరుగుతున్నాయి.. అంతా బాగానే ఉందని పెద్దలు పైకి గొప్పలు చెప్పుకుంటుంటే..క్షేత్రస్థాయిలో మాత్రం శ్రేణులు తలలు పగిలేలా తన్నుకుంటున్నారు. ముఖ్యంగా లోకల్..నాన్ లోకల్ అంశం చివరకు పరిస్థితులు రక్తచరిత్రకు దారులు తీస్తున్నాయి. సోమవారం కూకట్‌పల్లి అభ్యర్థి బండి రమేశ్‌కు మద్దతుగా జరిగిన కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో కార్యకర్తలు పొట్టు పొట్టుగా కొట్టుకున్నారు. సాక్షాత్తు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్, సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి పాల్గొన్న సమావేశంలోనే కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. బల్లలు చెల్లాచెదురు చేశారు. ఒకరినొకరు గల్లాలు పట్టుకొని పిడిగుద్దుల వర్షం కురిపించారు. చివరకు కొందరి కార్యకర్తల తలలు పగిలి రక్తాన్ని చిందించారు. కూకట్‌పల్లి ఎన్‌కెఎన్‌ఆర్ గార్డెన్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్, సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి ముఖ్య అతిథులుగా హాజరుకాగా.. నియోజకవర్గంలోని ఆయా డివిజ్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు. పార్టీ అధిష్ఠాన నేతలు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం సమష్టిగా పని చేయాలని ఓవైపు పిలుపునిస్తుండగానే.. మరోవైపు నుంచి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల కొట్లాట శబ్దాలు అధినేత తల చెవికి చేరుకున్నాయి. సమావేశంలోనే బాలాజీనగర్, బోయిన్‌పల్లి డివిజన్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలు ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. ఈ కొట్లాటలో కాంగ్రెస్ పార్టీ నాయకుడికి గాయాలతో పాటు రక్తస్రావం అయింది. వెంటనే నేతలు అక్కడినుంచి పారిపోగా.. కిందిస్థాయి నేతలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాంగ్రెస్ పార్టీలో కొట్లాటలు మామూలేనని సదరు కాంగ్రెస్ నేతలు వెళ్లిపోయారు.

## బండి రమేశ్‌కు ఎదురుగాలి?

కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి అడుగడుగునా ఎదురుగాలి వీస్తున్నది.. పార్టీమారి ఊరుకాని ఊరులో టికెట్ తీసుకోగానే.. కూకట్‌పల్లిలో 40 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్న సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు పార్టీకి రాజీనామా చేయడంతో పాటు వేలాది మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను తనవెంట తీసుకెళ్లాడు. బాలానగర్‌లో పార్టీ కార్యాలయం ప్రారంభించిన రోజే సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేతలు సత్యం శ్రీరంగం, యుగేంధర్‌రెడ్డి ఒకరిపై ఒకరు దూషణలకు దిగారు. ఇన్నాళ్లు కష్టపడ్డ వారిని పట్టించుకోకుండా పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో కొత్తగా వచ్చిన నేతలు హడావిడి చేయడం ఏంటంటూ కాంగ్రెస్ నేతలు ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకున్నారు. కూకట్‌పల్లిలో అంతంత మాత్రంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ఐక్యత లేని నేతల తీరు అర్థంకాక.. బండి రమేశ్ తలపట్టుకుని ప్రచారం ఎలా చేయాలిరా నాయనా.. అనుకుంటూ బాధపడిన దుస్థితి... ఏరి కోరి తెచ్చుకున్న టికెట్ కాబట్టి.. ఎన్నికల వరకైనా ఏదోవిధంగా ప్రచారం చేయాలన్న తలంపుతో రోజువారీ అడ్డా కూలీలను మాట్లాడుకుని.. రోజూ తనవెంట ప్రచారం కోసం తిరగాలని.. కాంగ్రెస్ జెండాలను కూలీలకు అప్పగించాడు. కూలీ పైసలు ఇవ్వగానే వారు ఇంటిబాట పడుతుండటంతో ప్రచారాన్ని ఆపేసి తానుకూడా ఇంటికి చేరుతున్నాడు. కాంగ్రెస్ పార్టీ నేతలు కలిసిరాక పోవడం.. స్థానికులెవ్వరూ అంతగా పరిచయం లేకపోవడంతో రోడ్లవెంట తిరుగుతూ ప్రచారం చేస్తుండటంతో శ్రేణులు విస్మయం చెందుతున్నారు.



తూంకుంట రోడ్ షోలో మాట్లాడుతున్న మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డి, మంత్రి రోడ్ షోకు హాజరైన జనం



# సంపద పెంచుతుండు.. పేదలకు పంచుతుండు

- మంత్రి మల్లారెడ్డి
- తూంకుంట, దేవరయాంజల్‌లో రోడ్ షో
- కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదు
- నడమంత్రపు సిరితో నవ్వుల పాలు

శామీర్‌పేట, నవంబర్ 6 : సీఎం కేసీఆర్ రాష్ట్రంలో సంపదను పెంచి, పేదలకు పంచుతున్నడని మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి చామకూర మల్లారెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మేడ్చల్ నియోజకవర్గంలోని తూంకుంట మున్సిపాలిటీలోని తూంకుంట, దేవరయాంజాల్‌లో సోమవారం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ అంటేనే ఒక చరిత్ర అని, దేశ చరిత్రలో కనివిని ఎరగని రీతిలో సీఎం కేసీఆర్ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు అందజేస్తున్నారని తెలిపారు. రాష్ట్రం సంక్షేమ, అభివృద్ధి పథకాల్లో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిపిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. పుట్టిన బిడ్డ నుంచి పండు ముసలి వరకు ప్రతి ఇంటికి ఏదో రూపంలో సంక్షేమ ఫలాలను అందిస్తున్న ప్రభుత్వం బీఆర్‌ఎస్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజలకు చేసిందేమిలేదని విమర్శించారు. ప్రజలను ఓటు అడిగే హక్కు బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఉందని మంత్రి అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏం మేలు జరిగిందని ప్రశ్నించారు. నీళ్లు లేవు, కరెంటు లేదు.. ప్రజల గోడు పట్టించుకున్న నాధుడే లేడన్నారు.

### జంగయ్యది నడమంత్రపు సిరి..

నడమంత్రపు సిరి ఎక్కువ రోజులు ఉండదని ప్రజలందరికి తెలుసనని మంత్రి మల్లారెడ్డి అన్నారు. తల్లిదండ్రులు పెట్టిన పేరును మార్చుకున్న తోటకూర జంగయ్య.. పైసలు బాగా సంపాదించి వజ్రేశ్‌యాదవ్‌గా పేరు మార్చుకున్నాడని తెలిపారు. పైసలు రాంగనే తల్లిదండ్రులు పెట్టిన పేరును మార్చుకున్న ఆయన వైఖరి ఎట్లుంటదో ప్రజలే ఆలోచించాలన్నారు. మల్కాజిగిరి నుంచి ఎంపీగా గెలిచిన రేవంత్ ఏనాడు ప్రజలను పట్టించుకోలేదన్నారు. ప్రజలకు మంచి చేయాలనే తాపత్రయం తనకు ఉన్నదని, మరోసారి ఆశీర్వదించాలని మంత్రి ప్రజలను కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా

# పోలీసు అధికారులకు జీవన నైపుణ్యాలపై శిక్షణ

జూబ్లీహిల్స్, నవంబర్ 6: సమాజ శ్రేయస్సుకు నిత్యం పాటుపడుతున్న పోలీసు అధికారులు, సిబ్బంది వారి కుటుంబాల శ్రేయస్సుకు సమయం కేటాయించాల్సిన అవసరం ఉందని టీఎస్‌ఎస్‌పీ బెటాలియన్స్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ స్వాతి లక్రా పేర్కొన్నారు. అమృత విశ్వ విద్యాపీఠం, హకీంపేట సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌లో తెలంగాణలోని బెటాలియన్స్ అధికారులకు సోమవారం నిర్వహించిన జీవన నైపుణ్యలపై శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పోలీసు అధికారులకు, సిబ్బందికి నిర్వహించిన ఈ 30 రోజుల క్యాంప్‌లో జీవన విలువలు, భావోద్వేగాల అదుపు, మానసిక ప్రశాంతత, సానుకూల ఆలోచనలు, ఆనందం, ప్రేమ శాంతి, సేవ తదితర అంశాలలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భవానీరావు, ఫ్యాకల్టీ రాధికా శెట్టి, రాధిక మోహన్, అయ్యర్, బెటాలియన్స్ అధికారులు పాల్గొన్నారు.

# దళితుల మధ్య చిచ్చుపెట్టే బీజేపీకి బుద్ధి చెబుతాం

- మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య



సమావేశంలో మాట్లాడుతున్న మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య తదితరులు

బంజారాహిల్స్, నవంబర్ 6: దళితుల నడుమ చిచ్చుపెట్టి వర్గీకరణ పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీకి కర్ణాటక తరహాలోనే తెలంగాణలో కూడా బుద్ధి చెబుతామని మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య హెచ్చరించారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 1లోని సంఘం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో మాల మాదిగల ఆర్థిక స్థితిగతులపై సమగ్ర సమాచారం లేకుండానే రాజ్యాంగ వ్యతిరేకమైన ఎస్సీ వర్గీకరణ గురించి ప్రస్తావిస్తూ ఎన్నికల్లో లబ్ధి పొందాలనుకునే కుటిల ప్రయత్నాలు చేస్తోందన్నారు. గతంలో అనేక కమిషన్లు వేసినా స్పష్టత రాలేదని, ఈ నెల 11న తెలంగాణ పర్యటనకు రానున్న ప్రధాని మోడీ ఏకపక్షంగా వర్గీకరణ అంశానికి మద్దతు ఇస్తే గట్టిగా సమాధానం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. కర్ణాటకలో వర్గీకరణ హామీ ఇస్తే ప్రజలు తిప్పికొట్టి బీజేపీని చిత్తుగా ఓడించారని, తెలంగాణలో కూడా అదే పరిస్థితి తప్పదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బూరుగుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేశ్ బాబు, మన్నె శ్రీధర్‌రావు, జంగా శ్రీనివాస్, రామాంజనేయులు, బంగి ఆనందరావు, గోకుల్, కళ్యాణ్, రమేశ్ పాల్గొన్నారు.